

రవీంద్రభారతిలో గురువారం రసరంజని ఆధ్వర్యంలో నిర్వహించిన చరణదాసు జానపద నాటక ప్రదర్శనలో ప్రేక్షకులను ఆకట్టుకున్న సన్నివేశం


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | HYDERABAD


## జనావాసాల్లోకి..జింక

### మెహిదీపట్నంలో ఓ ఇంట్లోకి..

నగరంలో గురువారం ఓ జింక జనావాసాల్లోకి ప్రవేశించింది. ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిమల్కాపూర్ సాయిబాబా గుడి సమీపంలోని ఇంట్లోకి ఎక్కడి నుంచో ఓ జింక వచ్చింది. దీనిని గమనించిన స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ జింకను ఆధీనంలోకి తీసుకొని వెంటనే జూ పార్క్ అధికారులకు అప్పగించారు.

- మెహిదీపట్నం ఫిబ్రవరి 27:




# ఆస్తిపన్ను రాయితీ రద్దు?

## అప్రకటితంగా ఆస్తిపన్ను పెంపు

- కేసీఆర్ సర్కారు ఇచ్చిన రూ.101 పథకానికి ఎసరు పెట్టిన బల్దియా
- పన్ను సవరణ పేరుతో ఇష్టారీతిలో బిల్లులు జారీ
- నాలుగింతల రేట్ల బిల్లులు వడ్డించి బకాయిలు కూడా కట్టాలంటూ నోటీసులు
- కంగుతింటున్న యాజమానులు
- సీఎం రేవంత్‌రెడ్డికి లేఖల ద్వారా ఫిర్యాదు చేస్తున్న బాధితులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఓల్డ్ బోయిన్‌పల్లి హస్మత్‌పేటలో సీహెచ్ ప్రసాద్ రావు తన ఇంట్లో 40 ఏండ్ల నుంచి నివాసం ఉంటున్నాడు. పీటీఐఎన్ నంబరు 1140900341 కలిగిన తన ఇంటికి ఏటా రూ.1100 లు ఆస్తి పన్ను చెల్లించేవారు. 2017 సంవత్సరంలో కేసీఆర్ ప్రభుత్వం ఆస్తిపన్ను రూ.1200 లోపు ఉన్న భవనాలకు ఏటా రూ.101లు పన్ను చెల్లిస్తే సరిపోతుందని ప్రత్యేక పథకాన్ని తీసుకువస్తూ జీవో జారీ చేశారు. ఈ పథకాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకుంటూ వచ్చారు. ఇటీవల సదరు యాజమానికి ప్రసాద్‌రావుకు ఎలాంటి సమాచారం లేకుండా సవరించిన ఆస్తిపన్ను నోటీసు అందింది. రూ.101 నుంచి ఏటా రూ.10,608ల చొప్పున ట్యాక్స్ వేసి నాలుగేళ్ల ట్యాక్స్ ఒకేసారి రూ. 43,267లు చెల్లించాలని నోటీసులు ఇచ్చింది. దీంతో కంగు తినడం ప్రసాద్ రావు వంతైంది. ట్యాక్స్‌ను అకస్మాత్తుగా ఎందుకు సవరించాల్సి వచ్చింది? రూ.101 స్కీం ఎత్తివేస్తూ జీవో ఏమైనా జారీ చేశారా? ఒకవేళ సవరిస్తే గతంలో మాదిరిగా రూ.1100లు కట్టాలి.. కానీ ఎందుకు ఏటా రూ. 10,608 లు కట్టాలి? వంటి ప్రశ్నలు వేసుకుంటున్నాడు. తన ఇంటి చుట్టు పక్కల ఎవరికీ రూ.1400 నుంచి రూ.2800లకు మించలేదు.. ఇదెక్కడి అన్యాయమని డిప్యూటీ కమిషనర్లను, టీఐ (ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల)ను అడిగినా ఫలితం లేదు. ఇదేక్కడి సవరణ, ఆస్తిపన్నుల జారీలో ఇష్టారాజ్యంగా అధికారుల వ్యవహారం ఉందంటూ సదరు ప్రసాదరావు సమగ్ర వివరాలతో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇక్కడ ఒక్క ప్రసాదరావుకే కాదు.. గ్రేటర్‌లో చాలా మంది రూ.101 స్కీం లబ్ధిదారులపై జీహెచ్‌ఎంసీ ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నది. ఇటీవల జీహెచ్ఎంసీ ప్రతి శనివారం నిర్వహిస్తున్న ఆస్తిపన్ను పరిష్కార వేదికలో ఈ తరహా ఫిర్యాదులు వస్తుండడం అధికారుల పనితీరుకు నిదర్శనం.

### రాయితీ పథకం రద్దు?

పేద, మధ్య తరగతి ప్రజలకు కల్పించిన ఆస్తిపన్ను రాయితీ పథకానికి కాంగ్రెస్ సర్కారు నీళ్లొదిలింది. ఆస్తి పన్ను రూ.1200లోపు ఉన్న నిర్మాణాలకు 2017 సంవత్సరంలో కేసీఆర్ ప్రభుత్వం పన్ను రాయితీ ఇచ్చింది. ఆ పరిధిలోని యజమానులంతా ఏడాదికి రూ. 101 పన్ను చెల్లిస్తే సరిపోతుందని కేసీఆర్ ప్రభుత్వం హామి ఇచ్చి ఆమలు చేశారు. ఈ మేరకు రూ.100కోట్ల మేర చెల్లింపుదారులకు లబ్ధి జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అనధికారికంగా రద్దు చేసింది. పన్ను సవరణ పేరుతో లబ్ధిదారుల మెడపై కత్తి పెట్టి. మీకు రూ.101 ఆస్తిపన్ను పథకం వర్తించదని, ఇకపై పూర్తి స్థాయిలో పన్ను చెల్లించాలంటూ ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నది. సెక్షన్ 220 ప్రకారం ట్యాక్స్ సవరణపై ప్రత్యేకంగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం రూ.101లు చెల్లించే పన్ను చెల్లింపుదారులకు పన్ను రాయితీ లేదంటూ ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నారు.

### అడ్డగోలుగా సవరణలు

జీహెచ్‌ఎంసీ పరిధిలో 19.49లక్షల ఆస్తులు ఉన్నాయి. వీటిలో గృహాలు 16.35లక్షలు, గృహాలు కానివి 2.80లక్షలు, మిక్స్‌డ్ 34వేల వరకు ఉన్నాయి. వీటిని ఈ ఆర్థిక సంవత్సరం నాటికి రూ.2100కోట్ల రూపాయలు రాబట్టే లక్ష్యంతో ఇప్పటి వరకు12.50 లక్షల మంది చెల్లింపుదారుల నుంచి రూ. 1506 కోట్ల వరకు రాబట్టారు. లక్ష్యం చేరుకోవడానికి ప్రస్తుతం రూ.101 ఆస్తిపన్ను చెల్లిస్తున్న భవనాలకు రేట్లను సవరించి పెంచాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించి, పెంచిన నాలుగు రేట్ల పన్నునే టార్గెట్‌గా వసూలు చేస్తున్నారు. నాలుగు కేటగిరీల్లోని రెండు లక్షల నిర్మాణాలను సర్వే చేసి..మొత్తంగా రూ.50కోట్ల మేర ఆదాయం పెంచుతుండడం గమనార్హం. ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండానే అడ్డగోలుగా సవరణలు చేస్తుండడం, ఇందుకు విద్యుత్‌శాఖ బిల్లులు, సబ్ రిజిస్ట్రార్లను పావుగా వాడుకుంటూ క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారీతిలో వ్యవహరిస్తుండడంతో ఆస్తిపన్ను బాధితుల సంఖ్య పెరిగిపోతున్నది.



నానక్‌రాం గూడ రహదారిలో ఉదయం ఆఫీస్ వేళలో విపరీతంగా పెరిగిపోయిన ట్రాఫిక్‌తో నత్తలా సాగుతున్న వాహనాలు

# వ్యాపారస్తులకు ఫుడ్ సేఫ్టీ నోటీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నది నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే గురువారం నగరంలోని పలు వ్యాపార సంస్థలపై జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం తనిఖీలు నిర్వహించింది. సంతోష్‌నగర్‌లో 4 ఎం వ్యాపారులు, మెహిదీపట్నంలో కింగ్స్ రెస్టారెంట్, కేఫ్, యూసుఫ్‌గూడ ఉషోదయ సూపర్ మార్కెట్, జుమ్రత్ బజార్ వద్ద జై భవానీ, చాంద్రాయణగుట్టలో క్రీమ్ ఫిల్స్ ఐస్‌క్రీమ్ తయారీ యూనిట్‌లపై తనిఖీలు చేపట్టగా..ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించలేదని పరిశీలనలో తేలింది. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేశామని, ల్యాబ్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.



## గ్రేటర్ @33 డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఉదయం పొగ మంచు ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.3 డిగ్రీలు, గాలిలో తేమ 48 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



# పరీక్షల వేళ.. ఆందోళనేల?

- సమయానికి నిద్ర.. సరైన ఆహారం అవసరం
- పరీక్షలు సమీపిస్తున్న వేళ గందరగోళం
- ఆందోళన వద్దంటున్న మానసిక వైద్య నిపుణులు
- పది, ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో పలు సూచనలు
- మానసిక నిపుణురాలు డాక్టర్ నివేదిత సామలతో నమస్తే ప్రత్యేక ఇంటర్వ్యూ



*జ్ఞానం కోసం చదువుకోవడం ఒకప్పటి మాట. మార్కులు, ర్యాంకుల కోసమే చదువుకోవాలనేది నేటి మాట. ఏడాదంతా ఆనందంగా గడిపిన విద్యార్థులు పరీక్షలనేసరికి ఒత్తిడికి గురవుతుంటారు. వారి చేష్టల ద్వారా తల్లిదండ్రులు సైతం ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. ఈ తరహా స్వభావం ప్రతి ఏడాది చూస్తూనే ఉన్నాం. అనేక మంది విద్యార్థులు ర్యాంకులంటూ పరిగెత్తి మానసికంగా కుంగిపోవడం గమనిస్తూనే ఉన్నాం. పరీక్షలు దగ్గరపడుతున్న వేళ విద్యార్థుల్లో నెలకొన్న భయాన్ని దూరం చేస్తూ కింగ్‌కోఠిలోని మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ నివేదిత సామలతో నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ..*



డాక్టర్ నివేదిత సామల

కొందరు విద్యార్థులు రోజులో అధిక గంటలు చదువుతూనే ఉంటారు. ర్యాంకులు, మార్కుల కోసం తిండి, నిద్ర మాని మరీ పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. మనిషికి పగలు ఎంత ముఖ్యమో.. రాత్రి కూడా అంతే ముఖ్యం. రాత్రి వేళల్లో నిద్రించగానే మానవుడి మెదడు మెమరీ కన్సాలిడేషన్‌లోకి వెళ్తుంది. విద్యార్థి కష్టపడి చదివినదంతా రాత్రి పడుకున్నాక జ్ఞాపక శక్తి గట్టిపడి గుర్తుండేలా చేస్తుంది. అందుకే తప్పనిసరిగా రోజుకు 6 నుంచి 8 గంటలు నిద్ర అవసరం.

### యోగా చేయండి..

చదువుతున్నాం.. కానీ, గుర్తుండటం లేదనే సమస్యతో అనేక మంది తమలో తామే బాధపడుతుంటారు. అదంతా వారి అపోహ మాత్రమే. ఎంత చదివినా మనిషికి గుర్తుండేది 80 శాతం మాత్రమే. నిరంతరం చదవడమే కాకుండా కాసేపు మ్యూజిక్ వినడం, కాసేపు మైదానంలో ఆటలు ఆడటం, యోగా, వ్యాయామాలు చేయడం వల్ల కూడా చదివింది గుర్తుంటుంది. మానసికంగా దృఢంగా ఉంటారు. సెల్‌ఫోన్ గంటకు మించి వాడినా వ్యసనంగా మారి మిమ్మల్ని నాశనం చేస్తుంది.

### పరీక్షల సమయంలోనే అధికం..

పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక సమస్యలతో బాధపడుతూ వైద్యులను సంప్రదిస్తుంటారు. సాధారణ రోజుల్లో నెలకు 150 నుంచి 180 మధ్యలో వస్తే, పరీక్షల సీజన్‌లో మాత్రం 200 మందికి పైగా వస్తుంటారు. గతేడాది ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు హైదరాబాద్ జిల్లాలోని 178 పాఠశాలలకు వెళ్లి గైడెన్స్ ఇవ్వడం వల్ల మంచి ఫలితాలు సాధించగలిగాం.

### ఆ మూడు గంటలు మీవే...

లోపల ఉండే భయాన్ని పక్కన పెట్టి ధైర్యంగా పరీక్షా కేంద్రంలోకి వెళ్లండి. మూడు గంటలు ప్రశాంతంగా పరీక్షలు రాయండి. ముందుగా పరీక్షా పత్రాన్ని ఒక పది నిమిషాలు ఓపికతో చదవండి. ఆ క్షణంలో మీ మెదడు వాటికి సంబంధించిన జవాబులను మీకు అందిస్తుంది. ఆ తరువాత మీకు తెలిసిన జవాబులు ముందు రాసి, రానివి ఆ తరువాత రాయండి. అన్నింటికి సమాధానాలు ఇచ్చే ప్రయత్నం చేయండి.

- సిటీబ్యూరో, ఫిబ్రవరి27 (నమస్తే తెలంగాణ):

# శునకాల లెక్క తేలేదెప్పుడు?

- పాత లెక్కలే చూపిస్తున్న అధికారులు
- పశుగణనమీదే ఆధారం
- ఇప్పటివరకు 5లక్షల ఇళ్లే సర్వేచేసిన అధికార యంత్రాంగం




సిటీబ్యూరో, ఫిబ్రవరి 27, (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో కుక్కల బెడద రోజురోజుకు అధికమవుతోంది. పెరుగుతున్న కుక్కల జనాభాతోపాటు వాటి బారిన పడే బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. జిల్లాలోని ఫీవర్ ఆసుపత్రికి రోజుకు 70 నుంచి 80 మంది కుక్కకాటు బాధితులే వస్తున్నారు. ఇదిలా ఉండగా జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న కుక్కల సంఖ్య తగ్గుతుందని, వాటికి కుటుంబనియంత్రణ నిర్వహిస్తున్నామని అధికారులు లెక్కలు చెప్పడం గమనార్హం. 2019లో నిర్వహించిన 20వ పశుగణన ప్రకారం హైదరాబాద్‌లో 51వేల కుక్కలు ఉన్నాయి. నాటినుంచి ఇప్పటివరకు ఆ సంఖ్య మరింత పెరిగిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మరో వైపు అధికారులు నేటికీ పాత లెక్కల ఆధారంగానే వాటి సంఖ్యను తెలుపుతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పశుగణన త్వరగా పూర్తిచేసి కుక్కల లెక్కలు జిల్లాలోని ప్రాంతాల వారీగా తెల్చి, కుక్కకాటుకు సరిపడా వాక్సిన్లు అందుబాటులో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఆగుతూ సాగుతోంది

21వ అఖిల భారత పశుగణన సర్వే గడువులోగా పూర్తిచేయడం కష్టంగా మారింది. గత ఏడాది నవంబర్ మొదటివారం నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు 16రకాల జంతువులు, పక్షులను లెక్కించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఆవులు, గేదేలు, పెంపుడు కోళ్లు, కుక్కలు, ఒంటెలు, గుర్రాలు, మేకలు, గొర్రెలు ఇలా మొదలైన వాటికి పశుగణన చేయాల్సిందిగా సూచించింది. అందులో భాగంగా మన రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా పశుగణన గడువులోగా పూర్తిచేయాలని ప్రభుత్వం తెలపడం గమనార్హం. అయితే ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి 21వ పశుగణన యాప్‌లో మ్యాపింగ్ ఆధారంగా సర్వే చేయాల్సి ఉంటుంది. ఈ సర్వే ఆధారంగానే ప్రభుత్వాలు మందులు, ఇతర ప్రోత్సాహకాలు విడుదల చేస్తుంటాయి. హైదరాబాద్ జిల్లాలో 9,60,000గృహాల్లో ఈ పశుగణన సర్వే నిర్వహించాల్సి ఉంది. ఇందుకుగాను 128 మంది ఎన్యూమరేటర్లు, 30 మంది సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. ఈ సర్వే ఈ నెల 28 నాటికి చివరి తేదీకాగా ఇప్పటివరకు 5,60,000గృహాల్లో సర్వే నిర్వహించారు.

**2019లో నిర్వహించిన 20వ అఖిల భారత పశుగణన హైదరాబాద్ జిల్లా వివరాలిలా..**

| జంతువు | సంఖ్య |
|---|---|
| ఆవులు | 15,635 |
| గేదెలు | 23,327 |
| గొర్రెలు | 13,230 |
| మేకలు | 33,876 |
| గుర్రాలు | 810 |
| గాడిదలు | 11 |
| ఒంటెలు | 31 |
| పందులు | 116 |
| కుక్కలు | 51,472 |
| కుందేళ్లు | 2600 |
| నాటుకోళ్లు | 23055 |
| బాతులు | 1163 |

### మ్యాపింగ్ సమస్యలతోనే ఆలస్యం..

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా పశుగణన చేసే సందర్భంలో మ్యాపింగ్ సమస్యలతో ఎన్యూమరేటర్లు ప్రారంభ దశలో చాలా ఇబ్బందులు పడ్డారు. దానితో పాటు యజమానుల వద్దకు వెళ్లి వివరాలు అడిగే సందర్భంలో ఇటీవల జరుగుతున్న సైబర్ మోసాల వల్ల వాళ్లు తమ వివరాలు తెలిపేందుకు సహకరించలేదు.

### సహకరించండి..

**- డాక్టర్ సంజీవరావు, 21వ పశుగణన నోడల్ అధికారి, హైదరాబాద్ జిల్లా**

పశుగణన పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. యజమానులు సర్వే సిబ్బందికి సహకరిస్తే త్వరగా పూర్తిచేసేందుకు ఆస్కారముంటుంది. ప్రారంభంలో మ్యాపింగ్ సమస్యలు ఎదురైనా, ప్రస్తుతం సాఫీగానే సాగుతోంది. గడువులోగా పూర్తికావడం సాధ్యం కాదు. మరింత సమయం అవసరం.

# మీరాలం పనులు ఇంకెప్పుడు?

## కేబుల్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యేనా?

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : ''మీరాలం చెరువు మీద సుందరమైన కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేస్తాం. దీనితో పర్యాటకంగా అ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు, ఓల్డ్ సిటీ రవాణా సదుపాయాలు మెరుగుపడతాయి. బెంగుళూరు హైవేకు మరింత వేగంగా చేరుకునే వెసులుబాటు దొరుకుతుంది.'' అంటూ సీఎం రేవంత్ రెడ్డి పలు వేదికలపై ప్రసంగించారు. కానీ ఈ ప్రాజెక్టును ఎవరు చేపడుతున్నారనేది ఇప్పటికీ గందరగోళంగానే మారింది. గతంలో ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేసేందుకు హెచ్ఎండీఏ ట్రాన్సాక్షనల్ అడ్వైజరీల నియామకానికి చర్యలు చేపట్టింది. ఆ తర్వాత పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డి చేసిన సమీక్షల్లో హెచ్ఎండీఏ అధికారులు లేకుండానే సమావేశాలు జరగాయి. అదే సమయంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఆథారిటీతోపాటు, జీహెచ్ఎంసీ అధికారలతో కలిసి ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం చర్చించింది. అసలు ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ఏ విభాగం పర్యవేక్షిస్తుందని ఇప్పుడు అంతు చిక్కని ప్రశ్నగా మారింది. మీరాలం చెరువును పర్యాటక ప్రాంతంగా, బెంగుళూరు హైవేకు రవాణా సదుపాయాలను మెరుగుపరిచేలా ఆధునీకరించాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మీరాలం బ్యూటిఫికేషన్ అప్పట్లోనూ కార్యాచరణ రూపొందించారు. అయితే అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆ చెరువుపై నిర్మించే కేబుల్ బ్రిడ్జి నిర్మాణాన్ని గందరగోళంలో పడేశారు.

### టీపీ టెండర్లను పిలిచింది హెచ్ఎండీఏ..

మీరాలం చెరువు అభివృద్ధికి చేపట్టాల్సిన నమూనాలను తీర్చిదిద్దేందుకు కన్సల్టెన్సీని ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏనే తొలుత టెండ్లను ఆహ్వానించింది. ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి, పబ్లిక్-ప్రైవేట్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సమగ్రమైన విధివిధానాలను రూపొందించే పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. కానీ ఆ తర్వాత జరిగిన సమీక్ష సమావేశాలను హెచ్ఎండీఏ ప్రమేయం లేకుండా నిర్వహించడంతో అసలు గందరగోళం మొదలైంది. నెల రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి కనీసం హెచ్ఎండీఏ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు లేకుండా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే అదే మీటింగ్‌లో ఎంఆర్‌డీసీఎల్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొనడంతో డీపీఆర్ రూపకల్పన ఏ విభాగం పర్యవేక్షిస్తుందనే తేలాల్సి ఉంది.



# ఇదేమి న్యాయం..?

## పరిహారం ఫైనల్ కాకుండానే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి టెండర్లా..?

రంగారెడ్డి, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : రేవంత్ సర్కార్ ఫ్యూచర్‌సిటీ కోసం కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు 300 అడుగుల వెడల్పుతో రేడియల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. భూములు కోల్పోనున్న బాధిత రైతులు రోడ్డు సర్వే పనులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసుల పహారా మధ్య సర్వే పనులను పూర్తి కానిచ్చారు అధికారులు. మొదటి దశ లో కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 18 కిలో మీటర్ల మేర రోడ్డు వేస్తున్నారు. రెండో దశలో మీర్‌ఖాన్‌పేట ఫ్యూచర్‌సిటీ నుంచి ఆకుతోటపల్లి ఆర్ఆర్ఆర్ వరకు 22 కిలోమీటర్ల మేర రహదారి వేయనున్నారు. ఇందుకోసం 1,004 ఎకరాల భూ మిని, సుమారు 4,725 మంది రైతుల నుంచి బలవంతంగా సేకరిస్తున్నారు. మొదటి, రెండో విడత రోడ్లను సుమారు 14 గ్రామా ల నుంచి వేస్తున్నారు. రోడ్డు వేయడం తో అర ఎకరం, ఎకరం, రెండు ఎకరాల భూములను కోల్పోతున్నామని.. రైతులు ఆందోళనబాట పట్టారు. అయినా ప్రభుత్వం మాత్రం తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోతున్నది.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో వేలాది మంది రైతులు తమ భూములను కోల్పోతున్నారు. వారికి పరిహారం ఎంతిస్తామనేది తేల్చకుండానే సర్కారు టెండర్లు పిలవడంపై బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముం దుగా రైతులు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని, లేని పక్షంలో మా ర్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చిన అధికారులు.. దీనిపై ఏమి తేల్చకుండానే టెండర్లు పిలవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేయనున్న కొంగరకలాన్, రావిర్యాల, కందు కూరు, ఫిరోజ్‌గూడ, కొంగరకుర్దు, లేమూర్, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లో భూముల ధరలు రూ.కోట్లల్లో పలుకుతున్నాయి. ముఖ్యంగా కొంగరకలాన్, రావిర్యాల, కందుకూరు మండలాల్లో ఎకరాకు సగటున రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు డిమాండ్ ఉన్నది. ప్రభుత్వం మాత్రం మార్కెట్ ధరకు రెండు లేదా మూడింతలు అధికంగా ఇస్తామని చెబుతున్నది. కాగా మా ర్కెట్ ధర రూ. పది నుంచి రూ. పదిహేను లక్షల వరకే ఉన్నది. దీంతో మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నేటి నుంచి టెండర్లు..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు నేటి నుంచి టెండర్లకోసం హెచ్ఎండీఏ అధికారులు దరఖాస్తులు కోరుతున్నారు. మార్చి 21 వరకు దరఖాస్తులను స్వీకరించి 21 తర్వాత బిడ్లను ఓపెన్ చేయనున్నట్లు సమాచారం. ఫేస్-1లో ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19 కిలోమీటర్లు, ఫేస్-2లో మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు ట్రిపుల్ఆర్ వరకు టెండర్లు కోరుతున్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2,365 కోట్లుగా అధికారులు ప్రకటించారు.

